# జోడేఘాట్‌లో కలెక్టర్ పర్యటన



జోడేఘట్‌లో గ్రామసభ నిర్వహిస్తున్న కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

కెరమెరి, డిసెంబర్ 7 : ప్రభుత్వ ఆదేశాలతో గురువారం జోడేఘాట్‌లో కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు పర్యటించారు. గ్రామ సభ నిర్వహించి డబుల్ బెండ్ రూం ఇండ్ల పురోగతి గురించి తెలుసుకున్నారు. లబ్ధిదారులతో మాట్లాడారు. కలెక్టర్ పలు అంశాలపై లబ్ధిదారులతో చర్చించారు. మంజూరైన ఇండ్లు.. పూర్తయిన ఇండ్ల గురించి పూర్తి సమాచారాన్ని సేకరించారు. కాగా, 2015లో 30 మందికి డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేసి టెండర్లు వేయగా, నిర్మాణానికి ఎవరూ ముందుకు రాలేదు. దీంతో పనుల్లో ఆలస్యమైంది. 2020లో ఐటీడీఏ ఆధ్వర్యంలో లబ్ధిదారులే నిర్మించుకునేలా చర్యలు చేపట్టారు. ఇప్పటి దాకా రూ. కోటి పనులు జరుగగా, రూ.62 లక్షల వరకు చెల్లించారు. మిగతా బిల్లులు రావాల్సి ఉంది. కలెక్టర్ ఆయా అంశాలపై లబ్ధిదారులతో చర్చించారు. పూర్తి వివరాలను ప్రభుత్వానికి నివేదించనున్నట్లు ఆయన తెలిపారు. అంతకుముందు పోరాట యోధుడు కుమ్రం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ఎంపీడీవో మహేందర్, తహసీల్దార్ జమీర్, కార్యదర్శులు ప్రజలు ఉన్నారు.

### డబుల్ బెడ్ రూం ఇండ్లపై సర్కారుకు నివేదిక



కుమ్రం భీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

## తప్పుడు ప్రచారం చేయడం సరికాదు




మాట్లాడుతున్న ఎంపీపీ డుబ్బుల నానయ్య

చింతలమానేపల్లి , డిసెంబర్ 7: మండలంలో గత రెండు రోజుల నుంచి బీఆర్‌ఎస్ ఎంపీపీ డుబ్బుల నానయ్యపై మండల ఎంపీటీసీలు అవిశ్వాసం పెడుతున్నారని తప్పుడు ప్రచారం చేస్తూ ఓ పేపర్లో రాయడాన్ని ఖండిస్తూ గురువారం ఎంపీపీ కార్యాలయంలో మండల ఎంపీటీసీలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసత్య ప్రచారాలు చేస్తున్న వారిని నమ్మవద్దన్నారు. కొందరు కావాలని తమ స్వార్థ రాజకీయాల కోసం అలా ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. డైరెక్ట్‌గా ఎదుర్కోలేక ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ఇలాంటి రాజకీయాలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. మండలంలోని బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు అందరూ కలిసి కట్టుగా కోనేరు కోనప్ప వెంట ఉండి ఆయన ఆధ్వర్యంలోనే పని చేస్తారని తెలిపారు. తప్పుడు ప్రచారం చేసేటోళ్లకి ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. అవిశ్వాసం అనేది చింతలమానేపల్లిలో జరుగదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా తప్పుడు స్టేట్ మెంట్స్ ఆపాలని హితవు పలికారు. సమావేశంలో ఎంపీపీ డుబ్బుల నానయ్య, ఎంపీటీసీలు జాబరి రాజన్న, ధన్‌రాజ్ మనోజిత్ మండల్, మండల కో ఆప్షన్ సభ్యుడు నాజీమ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌటాల, డిసెంబర్ 7: ఈస్‌గాం 132 కేవీ సబ్ స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం విద్యుత్ సరఫరాలో అంతరాయ కలగనున్నట్లు ఏడీఈ రాజేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. కౌటాల, సిర్పూర్, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

**కెరమెరిలో..**

కెరమెరి, డిసెంబర్ 7: మండలంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసిఫాబాద్ 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల పనులు ఉండడంతో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కెరమెరి మండలంలో విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు. మండలంలోని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

**బెజ్జూర్‌లో..**

బెజ్జూర్, డిసెంబర్ 7 : 132/33 కేవీ ఈస్‌గా సబ్ స్టేషన్ లో మరమ్మతులు చేపట్టనున్న సందర్భంగా బెజ్జూర్ సబ్ స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ అంజల్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరాను నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## సెల్‌ఫోన్ అప్పగింత

కౌటాల, డిసెంబర్ 7: చింతలమానెపల్లి మండలం రవీంద్రనగర్ గ్రామానికి చెందిన అనిల్ మండల్ ఇటీవల తన సెల్‌ఫోన్‌ను కౌటాల మండలం బోదంపల్లి గ్రామ శివారులో పోగొట్టుకున్నాడు. దీంతో వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కౌటాల ఎస్‌ఐ మధుకర్ సెల్‌ఫోన్ ఐఎంఈఐ నంబర్ ద్వారా ట్రేస్ చేసి సెల్‌ఫోన్‌ను పట్టుకున్నాడు. పట్టుకున్న సెల్‌ఫోన్‌ను బాధితుడికి గురువారం అప్పగించారు. దాని విలువ 16వేలు రూపాయలు ఉంటుందని బాధితుడు తెలిపారు. సెల్‌ఫోన్ పోయిన వెంటనే దగ్గరలోని మీసేవ కేంద్రంలో సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే రికవరి చేసేందుకు అవకాశం ఉంటుందని ఎస్సై తెలిపారు. సెల్‌ఫోన్‌ను వెతికి అందించిన పోలీసులకు బాదితుడు కృతజ్ఞతలు తెలిపాడు.

# కంకలమ్మ జాతర ఏర్పాట్ల పరిశీలన

కౌటాల, డిసెంబర్ 7: మండల కేంద్రంలోని కంకలమ్మ గుట్టపై ఈ నెల 10న జరుగనున్న కంకలమ్మ జాతర ఏర్పాట్లను కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, కౌటాల సీఐ సాధిక్ పాషా గురువారం పరిశీలించారు. ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్యతో జాతర ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇక్కడ కౌటాల ఎస్‌ఐ మధుకర్ ఉన్నారు.



జాతర స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ కరుణాకర్, సీఐ సాదిక్

**జాతరకు ప్రత్యేక బస్సులు**

కౌటాల మండల కేంద్రంలో నిర్వహించే కంకాలమ్మ జాతరకు 8 ప్రత్యేక బస్సులను ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య తెలిపారు. కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, సిర్పూర్ రైల్వే స్టేషన్ నుంచి కౌటాల జాతరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. భక్తులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# అవగాహన కోసమే క్షేత్రస్థాయి పర్యటనలు



రాబందుల సంరక్షణ గుట్టవద్ద శిక్షణ పొందుతున్న సెక్షన్ ఆఫీసర్లతో అసిస్టెంట్ డైరెక్టర్ రామ్మోహన్

పెచికల్‌పేట, డిసెంబర్7: శిక్షణలో ఉన్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లకు అవగాహన కలిపించేదుకే క్షేత్రస్థాయి పర్యటనలు చేపడుతున్నట్లు ఫారెస్ట్ అకాడమీ అసిస్టెంట్ డైరెక్టర్ రామ్మోహన్ తెలిపారు. దూలపల్లి అకాడమిలో శిక్షణ పొందుతున్న సెక్షన్ ఆఫీసర్లను గురువారం మండలంలోని కమ్మర్‌గాం సెక్షన్ పరిధిలోని రాబందుల సంరక్షణ ప్రదేశానికి తీసుకెళ్లి వాటి సంరక్షణ విధానాన్ని వివరించామన్నారు. అదేవిధంగా వన్యప్రాణుల సంరక్షణ, కాగజ్ నగర్ టైగర్ జోన్ విశిష్టతను వివరించామని చెప్పారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో వేణుగోపాల్, బీట్ ఆఫీసర్ వరుణ్‌రెడ్డి, వాచర్లు మహేశ్, జలపతి, సుభాష్, వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో పట్టపగలే చలిమంటలు

బజార్‌హత్నూర్, డిసెంబర్ 7: మూడు రోజులుగా తుఫాన్ ప్రభావంతో వాతావరణం చల్లబడడంతో ప్రజలు చలికి వణికిపోతున్నారు. ఉదయం నుంచి చలిగాలులు వీయడంతో మండలకేంద్రంలో పలు కాలనీల వాసులు మధ్యాహ్నం సైతం చలిమంటలు వేసుకున్నారు. చలిగాలులకు ఇంట్లో నుంచి జనం బయటకు రావడానికే జంకుతున్నారు. చిరుజల్లులు కురియడంతో చేతికి వచ్చిన పత్తి , కంది, శనగ పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మండలంలో పెరుగుతున్న చలితీవ్రత**

తాంసి, డిసెంబర్ 7 : మండలంలో చలి తీవ్రత పెరిగింది. సాయంత్రం ఆరుగంటలు దాటక ముందే చీకటి పడుతోంది. ఉదయం పొగమంచు కమ్ముకుంటోంది. గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గి, చలిగాలులు బలంగా వీయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు చలికాలం దృష్ట్యా అనేక వ్యాధులు ప్రబలే ప్రమాదమున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి శ్రావ్యవాణి సూచించారు.

## చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

కాగజ్‌నగర్ ఎస్పీఎం కాలనీ, డిసెంబర్7: కాగజ్‌నగర్ మండలంలోని ఈస్గాం పోలీసు స్టేషన్ పరిధిలోని విలేజ్ – 13 గ్రామానికి చెందిన భరుణ్ కుమార్ మండల్ ఇంట్లో ఈ నెల 4న రాత్రి పూజా మందిరంలోని హుండీలోని రూ.45వేలు దొంగిలించారు. ఈ మేరకు భాదితుడు ఫిర్యాదు చేయడంతో ఈస్గాం పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం నిందితుడు కర్ణాటక రాష్ట్రం రాయచూర్ కు చెందిన సుకుమార్ దత్తను విచారించగా అతని వద్ద నుంచి రూ.42 వేలు రికవరీ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఈస్గాం ఎస్‌ఐ రామన్‌కుమార్ తెలిపారు.

## వారసంతలో సౌకర్యాలు లేక అవస్థలు



వాంకిడి వారసంతలో షెడ్లు సౌకర్యాలు లేక నేలపైనే క్రయవిక్రయాలు

వాంకిడి, డిసెంబర్ 7: మండల కేంద్రంలోని వారసంతలో వ్యాపారులకు కనీస షెడ్లు, సౌకర్యాలు లేకపోవడంతో కర్రలకు కవర్లు కట్టి వ్యాపారాలు జరుపుకొంటున్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు నిత్యావసర సరుకులు, కూరగా యాలు కొనుగోలు చేయడానికి ప్రతి గురువారం నిర్వహించే వారసంతకు వస్తుంటారు. వర్షాకాలంలో చిన్న పాటి వర్షానికి సైతం తడుస్తూ నిత్యావసర సరుకులు, కూరగాయలు కొనుగోలు చేసేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సంతలో షెడ్లు లేకపోవడంతో వర్షాకాలంలో వ్యాపారులు, ఇటు ప్రజలు తడుస్తూ క్రయవిక్రయాలు చేయాల్సి వస్తుంది. ప్రతి సంవత్సరం సంతవేలం పాటలో రూ.9 లక్షల వరకు ఆదాయం వస్తున్నా వారసంతలో ఎలాంటి సదుపాయాలు కల్పించకపోవడంపై వ్యాపారులు, వినియోగదారులు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. ఇప్పటైనా ఉన్నతాధికారులు స్పందించి వారసంతలో షెడ్లు, సీసీరోడ్లు నిర్మించి సదుపాయాలు కల్పించాలని వ్యాపారులు, వినియోగదారులు కోరుతున్నారు.

## కార్డియాక్ పరికరం పనితీరుపై శిక్షణ

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 7 : జిల్లా కేంద్రం లోని సమీకృత కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో గురువారం కార్డియాక్ ఏఈడీ పరికరం పనితీరుపై వైద్యులకు అవగాహన కల్పిం చారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ధన్‌రాజ్ మాట్లాడుతూ కార్డియాక్ అరెస్ట్ వల్ల గుండె కొట్టుకోవడం ఆగిపోతే ఈ పరికరం తిరిగి గుండె కొట్టుకోవడానికి ఉపయోగ పడు తుందని తెలిపారు. శిక్షకుడు షేక్ అలీం, డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాజేందర్, కార్యక్రమ నిర్వహణ అధికారి శ్రీని వాస్, రవీందర్, తదితరులున్నారు.